




మోహన్‌దాస్ పాయ్ ఇన్ఫోసిస్ మాజీ సీఈవో. ఈమధ్య ఆయన నారాయణ మూర్తితో ఓ పాడ్‌కాస్ట్ చేశారు. అందులో మూర్తి మాట్లాడుతూ– 'ఇతర దేశాలతో పోలిస్తే భారతీయుల ఉత్పాదక శక్తి చాలా తక్కువ. ఆ లోపాన్ని అధిగమించకపోతే, మనం అభివృద్ధి సాధించలేం' అనేశారు. అంతేకాదు 'రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కొన్నాళ్లపాటు జర్మనీ, జపాన్ దేశస్తులు అదనపు గంటలు పనిచేయడం వల్లే ఆయా దేశాలు నిలదొక్కుకున్నాయి' అని వక్కాణించారు. సహజంగానే ఈ 70 గంటల మాటలు వైరల్ అయ్యాయి. కొంతమంది సమర్థన, మరికొందరి విభేదం వినిపించాయి. ఈ చర్చకు బదులిస్తూ మూర్తి 'పేదరికం అనే విషవలయం నుంచి తప్పించుకోవాలి అంటే కష్టపడి పనిచేయాల్సిందే అని మా తల్లిదండ్రులు చెప్పేవారు. అది ఆచరించిన తర్వాతే నేను 70 గంటల పనివారాన్ని సూచించాను. చాలా ఏళ్లుగా నేను వారానికి 85–90 గంటలు పనిచేస్తూనే వచ్చాను. పొద్దున 6.20 కల్లా ఆఫీసుకు వెళ్లి, రాత్రి 8:30 తర్వాతే బయటకు వచ్చేవాడిని' అని చెప్పుకొచ్చారు. తన వ్యాఖ్యలను అభినందిస్తూ చాలా ఫోన్ కాల్స్ వచ్చాయనీ... చాలామంది మంచి వ్యక్తులూ, ప్రవాసులు తన వ్యాఖ్యలను సమర్థించారని అన్నారు. భర్తకు అండగా నిలిచే సుధామూర్తి ఈ వ్యాఖ్యల విషయంలోనూ భర్తను బలపరిచారు. వారానికి 70 గంటలు పనిచేసే అలవాటు తమ కుటుంబం అంతా ఉందని చెప్పారు. ఈ 70 పనిగంటల వ్యాఖ్య ఎవరో చేసి ఉంటే మాధ్యమాలు పెద్దగా పట్టించుకునేవి కావు. కానీ అన్నది ఇన్ఫోసిస్ మూర్తిగారు కావడంతో... చర్చ మొదలైంది. ఆఖరికి పార్లమెంటులో సైతం దీని గురించి ప్రస్తావన వచ్చింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు... ఈ 70 గంటల పనివారాన్ని ప్రభుత్వం ఓ నిబంధనగా మార్చే ఉద్దేశం ఏమన్నా ఉందా అని అడిగే దాకా వచ్చింది.

### కార్మిక చట్టం ఏమంటున్నది?

2022లో సవరించిన మన దేశ కార్మిక చట్టం ప్రకారం... సాధారణ పరిస్థితుల్లో వారానికి 48కి మించిన పని గంటలు ఉండకూడదు. భోజన విరామంతో కలిపి రోజుకు 9 గంటలు దాటకూడదు. అంటే ఉద్యోగి తినే సమయాన్ని అతని వ్యక్తిగత ఖాతాలోనే జమచేస్తారే కానీ కంపెనీ లెక్కల కిందకు రాదు. ఒకవేళ రోజుకు తొమ్మిది గంటల పనివేళలు దాటితే... అదనపు గంటలకు రెట్టింపు జీతం ఇవ్వాలి. మూర్తిగారు చెప్పిన 70 గంటలతో పోలిస్తే ఈ 48 గంటలు తక్కువగానే కనిపించవచ్చు. కానీ చాలా దేశాలతో పోల్చుకుంటే ఇది ఎక్కువే. ఎంతో మంది ఆదర్శంగా చూసే అమెరికా, చైనాల్లో ఇది 40 గంటలు మాత్రమే. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇది 40 గంటలే. ఆస్ట్రేలియాలో అయితే 38 గంటలు. చాలా దేశాలు తమ పని గంటలను 40 గంటలకు తగ్గించుకోవడానికి ఓ ముఖ్య కారణం– కరోషి! అంటే జపాను భాషలో... ఎక్కువ పని చేయడం వల్ల సంభవించే మరణం! ఎక్కువ పని వల్ల కలిగే ఒత్తిడితో గుండెపోటు, పక్షవాతం, పోషకాహార లోపం లాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయనీ... ఇది ఒక్కోసారి ఆత్మహత్యలకు సైతం దారితీస్తున్నదని తేలింది. ఉదాహరణకు స్వీడన్లోనే ఓ ఏడాది 770 మంది అధిక పని వల్ల కలిగిన ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నారని ఓ వార్త. చైనాలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని అక్కడి ప్రభుత్వమే ఒప్పుకొని, పనిగంటల్లో వెసులుబాటు కల్పించే చర్యలు మొదలుపెట్టింది.

### పని గంటలు అంటే!

ఓ కార్మికుడు లేదా ఉద్యోగి పని చేసే ఉత్పాదక సమయాన్ని మాత్రమే పని గంటలుగా భావిస్తాం. కానీ, తను భోజనం చేసే సమయం, ఆఫీసుకు వెళ్లి వచ్చే ప్రయాణం ఈ లెక్కల్లోకి రాదు. నగరాల్లో ఆఫీసుకు వెళ్లాలి అంటే రానుపోను రెండు గంటలు పడుతుంది. ఇక మన దేశంలో కనిపించే మరో ప్రత్యేక విధానం... ఇంటికి వెళ్లిన తర్వాత కూడా ఆఫీసుకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అయితే జూమ్ కాల్స్, మెయిల్స్ ద్వారా పగలూరాత్రి తేడా లేకుండా విధులకు అందుబాటులో ఉండాలి. ఇక వాట్సాప్ వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ నిరంతరం ఆఫీస్ సందేశాలకు స్పందించాల్సిన పరిస్థితి. ఎప్పుడన్నా సెలవు తీసుకోవాలంటే, ఆ రోజుల్లో చేయాల్సిన పనులను ముందుగానే ముగించి వెళ్లాలి. ఇవన్నీ కూడా విధి నిర్వహణలో భాగంగా పరిగణిస్తే... చాలామంది జీవితాలు 70 గంటల పరిధిని దాటిపోతాయేమో! పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి పరిస్థితి కనిపించదు. ఆఫీసు వేళల తర్వాత స్పందించడం, సెలవుల్లో కూడా అందుబాటులో ఉండటాన్ని అక్కడి ఉద్యోగులు ఇష్టపడరు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితంలోకి అడుగుపెట్టేందుకు యాజమాన్యాలు కూడా జంకుతాయి. 'ఆఫీసు నుంచి బయటికి వెళ్లిన తర్వాత ఓ ఉద్యోగి తన ఫోన్ తీయకపోతే, అది బాధ్యతారాహిత్యం కిందకు రాదు' అని ఫ్రాన్స్ ప్రభుత్వం ఎప్పుడో ప్రకటించింది. దీన్నే 'రైట్ టు డిస్కనెక్ట్' అంటున్నారు. ఈ పేరుతో చట్టాలు కూడా రూపొందుతున్నాయి.



### నిజమైన పని గంటలు ఎలా ఉన్నాయి!

ఒక వ్యక్తితో వారానికి ఎన్ని గంటలు పనిచేయించుకోవచ్చో ప్రభుత్వం చెప్పే నిబంధనలు అటుంచుదాం. అసలు నిజంగా మన భారతీయులు ఎంత పని చేస్తున్నారో గమనిస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచంలోనే ఎక్కువ పనిగంటలు నమోదయ్యే దేశాలలో మనది 7వ స్థానం. మనం వారానికి సగటున 47.7 గంటలు పనిచేస్తున్నామన్నది ఆ సంస్థ నివేదిక. అమెరికా, జర్మనీ లాంటి అభివృద్ధి చెందిన దేశాలే కాదు... చైనా, సింగపూర్, జపాన్ లాంటి ఆసియా సోదరుల కంటే కూడా మనం ఎక్కువ పనిచేస్తున్నాం. ఈ జాబితా గమనిస్తే కనిపించే మరో ఆశ్చర్యకరమైన విషయం... ఇందులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రథమ స్థానంలో ఉండటం. అక్కడ పనిచేసే కార్మికులలో ఎక్కువ శాతం భారతీయులే కావడం గమనార్హం! ఇక క్లాకిఫై అనే సంస్థ గణాంకాల ప్రకారం ఒక ఏడాదిలో భారతీయులు 2,480 గంటలు పనిచేస్తున్నారు. అమెరికా (1892), జపాన్ (1903), చైనా (2392) తదితర దేశాల కంటే ఇది చాలా ఎక్కువ. ఈ గణాంకాల నేపథ్యంలో వినిపించే మరో విశ్లేషణ ఏమిటంటే... ఒక దేశం ధనికంగా మారుతున్న కొద్దీ, అక్కడి పనిగంటలు తగ్గుముఖం పట్టడం! ఓ వ్యక్తి ఉత్పాదకత వల్ల తగినంత ఆదాయం సమకూరడమే ఇందుకు కారణం.

### వివాదాస్పదమైన 996 విధానం

ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు వారానికి 6 రోజుల పాటు పనిచేయడమే ఈ 996 విధానం. చైనాలో చాలా ఫ్యాక్టరీలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు అనుసరించే ఈ విధానంతో అక్కడి ఉద్యోగులు నలిగిపోయారు. చిన్నవయసులో అకస్మాత్తుగా చనిపోవడం, ఒత్తిడితో ఆత్మహత్య చేసుకోవడం సహజంగా మారాయి. ఓ డెలివరీ సంస్థలో పనిచేసే ఉద్యోగి నిప్పంటించుకుని చని